కథా నిలయం
శ్రీకాకుళం

# నన్ను బ్రతికించండి!

"బాబూ! భావనయ్యా!"

ఇంటి అరుగుమీద మడత కుర్చీలో నడుం వాల్చి దినపత్రిక చదువుతూన్న భావనరావు తుళ్ళిపడి తలెత్తి చూశాడు. ఎదురుగా రాజయ్య ఎముకల పోగులా ఉన్నాడు. చేతిలోని కర్ర ఆసరాతో నిలబడ్డ అతని ముఖంలో ఏదో నిర్వచించలేని బాధ, నిర్వేదం, నిరాశ, నిస్పృహలు. భావనరావు రాజయ్యను ఎందుకొచ్చావంటూ ప్రశ్నించలేదు. రాజయ్య రాకలోని అంతర్యాన్ని, ముఖంలో ముసురుతోన్న భావాల్ని అర్థం చేసుకున్నట్టుగా ఒక పాలిపోయిన చిరునవ్వును పెదాలమీద వెలిగించేడు. పేపరు మడిచి పక్కన పెడుతూ రాజయ్యను అరుగుమీద కూర్చోమంటూ సైగ చేశాడు. రాజయ్య కూర్చోలేదు. కర్ర ఆసరాతో అలాగే నిలబడ్డాడు.

భావనరావు వృత్తిరీత్యా ఆ పల్లెటూళ్ళో బడిపంతులు. ప్రవృత్తిరీత్యా మానవతావాది. అమాయకులైన ఆ ఊరిజనానికి చేదోడు వాదోడుగా ఉంటూ, మంచి మాటలు చెబుతుంటాడు. చేతనైన సహాయం చేస్తూ ఎవరికే కష్టం వచ్చినా నే నున్నానంటూ ముందుకొచ్చి నిలబడతాడు. కాని రాజయ్య కొచ్చిన కష్టం విన్నపుడు మాత్రం భావనరావుకు ఏడవాలో, నవ్వాలో తెలియలేదు. హృదయం ఆర్ద్రమైంది. ఆవేశం ముందుకు తోసింది. అతను పనిగట్టుకుని చేయగలిగిన ప్రయత్నమంతా శాయశక్తులా చేశాడు. ఇంకా చేస్తూనే ఉన్నాడు. ఫలితం మాత్రం అందుబాటులోకి రాలేదు.

"రాజయ్యా! రెండు రోజుల్లో నేను మళ్ళీపట్నం వెడతాను. పై వాళ్ళతో గట్టిగా మాట్లాడి నీ విషయం తేల్చుకుంటాను.!" భావనరావు సాలోచనగా రాజయ్యవైపు చూస్తూ భరోసా ఇచ్చాడు. రాజయ్య వంగి వంగి దణ్ణాలు పెట్టాడు.

" సిత్తంబాబూ! మిమ్మల్నే నమ్ముకున్నాను. పున్నెం గట్టుకోండి! మీ ఋణం ఉంచుకోను!"

"ఋణం సంగతి ఎందుకులే రాజయ్యా! నీ కష్టం తీరితే నా కంతేచాలు. వెళ్ళు!" భావనరావు మాటలతో రాజయ్య మరొక్కసారి చేతులు జోడించి, కుంటి కాలితో భారంగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు. వృద్ధాప్యపు బరువుతో నీరసంగా, నిస్తేజంగా నడిచి వెళ్తోన్న రాజయ్యను అలా చూస్తోంటే భావనరావు మనసు బాధగా మూలిగింది. రాజయ్య కథనీ, అతనికొచ్చిన కష్టాన్ని మరొకసారి నెమరేసింది.

ఆ రోజు రాజయ్య నిద్రగన్నేరు చెట్టుకింద నిద్రపోతున్నట్టుగానే చతికిలపడి కూర్చున్నాడు. ఉదయం పది గంటలు దాటింది. సూర్యుడు ఎర్రగా ఎదిగి పైకి ఎగబాకుతున్నాడు. రాజయ్య కళ్ళు వాలిపోతున్నాయి. కాళ్ళు తేలిపోతున్నాయి. కడుపులో ఆకలి సరేసరి కరకరమంటూంది. నీరసం నిలువెల్లా పాకుతూంది. తెల్లవారుజామునెప్పుడో కాలి నడకన కుంటికాలితో పల్లెనుంచి బయలుదేరి వచ్చేడు. కనీసం చల్లినీళ్ళు కూడా గొంతులో పోసుకోలేదు.

నెత్తిపైన గన్నేరు చెట్టుమీద రాత్రి పక్షులు తల క్రిందులుగా వేలాడుతూ తపస్సు చేస్తున్నాయి. రాజయ్య ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. నెత్తిమీద చేత్తో తడుముకున్నాడు. ఏదో పిట్ట పైనుంచి చటుక్కున రెట్ట వేసింది. రాజయ్య ఉస్సురని నిట్టూరుస్తూ భుజంమీది తుండుగుడ్డతో నెత్తిమీద తుడుచుకున్నాడు. ఎదురుగా ఆఫీసు వరండాలో తాసిల్దారు బంట్రోతు కాబోలు, హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఎవరెవరో చుట్టుపక్కల ఊళ్ళనుంచి వచ్చిన జనం, ఆఫీసు గుమస్తాలు, అక్కడక్కడా ఎర్రటోపీలతో పోలీసులు, రాజయ్యకు మసకమసకగా కనిపించసాగారు.

ఆ ఆవరణలో తాలూకాఫీసు, ప్రభుత్వ ఖజానా ఆఫీసు, పోలీసు స్టేషను త్రిమూర్తి స్వరూపాల్లా చోటు చేసుకున్నాయి. అందరూ ఏదో ఒక పనిమీద అక్కడకు రావడం తప్పనిసరి. ఆవరణ అప్పటికే సందడిగా ఉంది.

రాజయ్య ప్రభుత్వ ఖజానా ఆఫీసు వైపు దృష్టిని సారించేడు. అతని కళ్ళు ఆత్రంగా వెదికాయి. ఆఫీసరు బాబు వచ్చిన జాడలేదు. ముగ్గురు గుమాస్తాలు వచ్చి తాపీగా చిట్టాలు ముందేసుకుని కూర్చున్నారు. రాజయ్య నిరాశగా కళ్ళు మూసుకున్నాడు.

" టీ !బాబూ!టీ! గరమ్, గరమ్ చాయ్!" చంకన పెద్ద ఫ్లాస్కు, చిన్న బకెట్టు, గ్లాసుల్తో పన్నెండేళ్ళ కుర్రాడు జనం మధ్య చకచకా తిరుగుతూ టీ అమ్ముతున్నాడు.

రాజయ్యకు టీ తాగాలనిపించింది. జిహ్వ కొట్టుకు లాడింది. జేబులో చేయిపెట్టి తడుముకున్నాడు. ముప్పై పైసలు ఉన్నాయి. ముప్పై పైసల్తోనూ టీ తాగేస్తే చుట్టముక్కలకి డబ్బులు మిగలవు. చుట్టముక్కల్లేకపోతే ప్రాణం కొట్టుకులాడిపోతుంది. రాజయ్య టీ తాగే ప్రయత్నాన్ని దిగమింగుకున్నాడు.

రాజయ్య ఒకప్పుడు అదే ఊళ్ళో ప్రభుత్వం వారి గెస్టుహౌసుకు వాచ్‌మన్‌గా పని చేసి రెండేళ్ళ క్రితమే రిటైరయ్యాడు. రిటైరైన సంవత్సరంలోనే భార్యను పిచ్చికుక్క కరిచి కన్ను మూసింది. ఒంటరివాడైన రాజయ్య ఏ దారీ లేకఏడు మైళ్ళ దూరంలో ఉన్న కూతురింటికి కూడూ - గూడూ వెతుక్కుంటూ వెళ్ళాడు. కొన్ని రోజులు కూతురైతే అక్కున చేర్చుకుంది, గాని అల్లుడు అంతగా ఇష్టపడలేదు. సూటిపోటి మాటలతో అతని అభిమానాన్ని దెబ్బ కొట్టాడు. ఎక్కడో, ఎన్నో మైళ్ళ దూరంలో ఉన్న ఒక్క కొడుకు తండ్రి బ్రతుక్కి తన బాధ్యత లేదన్నాడు. ఆ కొడుక్కి బొగ్గుల గనిలో పని. తల్లి బుగ్గయినప్పుడు కూడా అతనికి రావడానికి వీలుపడలేదు. రాజయ్య రోడ్డున పడ్డాడు.

రాజయ్యకు ఒక కాలు కుంటిది. కుంటి రాజయ్యను ప్రభుత్వం కనికరించి ఓ దారి చూపించింది. రాజయ్యకు ఆ దారిలో కూడు దొరికింది. తల దాచుకొనే గూడూ దొరికింది. కాని మూడు నెలలుగా రాజయ్యకు ఎవరికీ రాని సమస్య వచ్చి పడింది. అల్లంత దూరంలో ఆ సమస్యకు పరిష్కారం మాత్రం కనిపించటంలేదు.

రాజయ్య తుళ్ళిపడి లేచాడు. పక్కనుంచి బర్రుమని శబ్దం చేసుకుంటూ రెండుజీపులు ముందుకెళ్ళాయి. తాసీల్దారు కాబోలు ఒక జీపులోంచి హుందాగా దిగాడు. మరో జీపులోంచి ఇద్దరు ఆఫీసర్లు దిగి ఖజానా ఆఫీసువైపు నడిచారు. రాజయ్య ఒంట్లో శక్తిని కూడదీసుకుని నెమ్మదిగా వంగి నడుస్తూ ఖజానా ఆఫీసు ముందుకొచ్చాడు. అక్కడ బిళ్ళ బంట్రోతు ఒక స్టూలుమీద కూర్చున్నాడు.

" బాబూ! ఆఫీసరు బాబొచ్చినారా?" రాజయ్య ఆత్రంగా అడిగాడు.

" ఆ వచ్చినారు! ఏటి గావాలేటి?"

" బాబ్బాబూ! నీకు పున్నెం ఉంటది. ఆ బాబు నొకపాలి సూపించు. సేనా దూరం నించి వచ్చినా. కలిసి కట్టం సెప్పుకుంటాను." రాజయ్య ప్రాధేయపడుతూ బంట్రోతు రెండు చేతులూ పట్టుకున్నాడు. బంట్రోతు కుదరదు పొమ్మన్నాడు. రాజయ్య కళ్ళనీళ్ళు పెట్టుకున్నా అతను కరగలేదు. అరగంట గడిచింది. రాజయ్య కుంటికాలితో, నీరసంతో నిలబడలేకపోతున్నాడు. ఎండలో వేడి, గాలి ఎక్కువవుతున్నాయి. కొంత సేపటికి బంట్రోతు " నీకాడ చిల్లర పైసలేవన్నా ఉన్నాయా?" అంటూ చిద్విలాసంగా నవ్వాడు. రాజయ్య జేబులోని ముప్ఫై పైసలు ముడుపు చెల్లించి అతని చేతులు పట్టుకున్నాడు. మరో అయిదు నిముషాల తరువాత ఖజానా ఆఫీసురుగారి గదిలో ఉన్నాడు రాజయ్య.

" దణ్ణాలు బాబయ్యా! "

ఆఫీసరుగారు వినిపించుకోలేదు. అయిదు నిముషాల వరకూ తలెత్తలేదు. తీరా తలెత్తి చూసిన తరువాత ఎందుకొచ్చావంటూ జెర్రిపోతులా గుర్రుమన్నాడు.

" నా పేరు రాజయ్యండి. వాచ్‌మన్‌గా పన్జేసి రిటైరయ్యానండయ్యా! మూడ్నెల్లుగా నాకు ఫించను డబ్బులు రావడం లేదండి. మా రాజులు కనికరించాల!" రాజయ్య ఒదిగిపోతూ రెండు చేతులూ జోడించాడు. ఆఫీసరుగారు ఏ కళ ఉన్నా... ఏమనుకున్నారో బెల్లు మోగించి బంట్రోతును పిలిచారు. బంట్రోతు వచ్చాడు. ఆఫీసరుగారు ఆదేశించిన ప్రకారం ఓ రిజిష్టరు, ఫైలు తీసుకొచ్చి చేతికిచ్చాడు. కొన్ని నిముషాల తరువాత ఆఫీసరుగారు తలెత్తి చూశారు.

" రాజయ్యంటే మువ్వేనా?"

"నానేనండి బాబయ్యా!" తల పంకిస్తూ రెండు చేతులూ కలిపాడు రాజయ్య.

"నువ్వు రాజయ్యవు కాదు. రాజయ్య మూణ్ణెల్ల క్రితమే చచ్చిపోయాడు. ఇదిగో మాకు ఆర్.డి.వో. గారిచ్చిన ఆర్డరు కాగితం!"

రాజయ్యకు మొదట ఆ ఆఫీసరుగారు ఏమంటున్నారో అర్థం కాలేదు. అర్థంగాక మళ్ళీ అడిగాడు. ఆఫీసరుగారు నములుతోన్న కిళ్ళీతో బాటు ఒక నిమిషం కోపాన్ని కూడా కసాపిసా నమిలారు.

"రాజయ్యే నువ్వయితే మూణ్ణెళ్ళ క్రితమే నువ్వు చచ్చిపోయావు. నీకు పింఛను రాదు.... వెళ్ళు!" ఆఫీసరుగారు అసహనంగా అని ఫైల్లోకి తల దూర్చాడు. రాజయ్యకు బుర్ర గిర్రున తిరిగింది.

శరీరంలోని జీవశక్తి అంతా హరించుకుపోయి, కాళ్ళు నేలలోకి కూరుకుపోతున్నట్లనిపించాయి.

"బాబయ్యా! నాను సచ్చిపోవటం ఏంటండీ! పేణాల్తో మీ ముందు నిలబడే ఉన్నాను. గదయ్యా!" రాజయ్య అమాయంగా ముఖం పెట్టి అడిగాడు.

" ఏమో! నాకు తెలియదు! మా రిజిష్టరు ప్రకారం నువ్వెప్పుడో చచ్చిపోయావు. నిజంగా నువ్వు బ్రతికే ఉన్నట్టయితే పెద్ద డాక్టరుగారి దగ్గర్నుంచి బ్రతికున్నట్టుగా ఓ సర్టిఫికేటు

తెచ్చుకో! దానితో బాటు నన్ను బ్రతికించండని రివెన్యూ డివిజనల్ ఆఫీసరుగారికి ఓ దరఖాస్తు పెట్టుకో! వెళ్ళు!"

ఆఫీసరుగారు చికాకు పడిపోతూ అదే పనిగా బెల్ మోగించారు. బంట్రోతుగారు హడావిడిగా లోపలికొచ్చి రాజయ్యను బరబరా బయటకు లాక్కొని పోయారు.

ఏవిటి తను చచ్చిపోయాడా? ఎప్పుడు? ఎలా చచ్చిపోయాడు? ఏందుకు చచ్చిపోయాడు? తను మూణ్ణెల్ల క్రితమే చచ్చిపోతే ఇప్పుడు ఆఫీసుకు మళ్ళీ ఎలా రాగలిగేడు?

రాజయ్య ఆలోచించే శక్తి ఎప్పుడో కోల్పోయాడు.

ప్రభుత్వం కనికరించి రాజయ్యకు వందరూపాయలు పింఛను మంజూరు చేసింది ఆ పింఛను డబ్బుల్తో ఒకరి పంచన బ్రతక్కుండా అయిదు రూపాయలకు ఓ గుడెసె అద్దెకు తీసుకున్నాడు. ఎలిమెంటరీ స్కూలు ముందు గోనెపట్టా పరుచుకుని వేరుసెనక్కాయలమ్ముకుంటూ కూతురు కాపురం చేసే ఊళ్ళోనే కాలక్షేపం చేస్తున్నాడు. ఎందువల్లనో రాజయ్యకు మూడు నెలలుగా ఫించను డబ్బులు రావడంలేదు. ఒక నెల ఓపికతో ఎదురు చూశాడు. రెండవ నెలలో ఆదరాబదరా ఆఫీసుకొచ్చాడు. మొర పెట్టుకున్నాడు. అతని మొర ఎవరూ వినిలేదు. ఆఫీసరుగార్ని కలుద్దామంటే కుదురలేదు. గుమస్తా ఒకడు 'కంయ్' మని కసిరి బయటకు పొమ్మన్నాడు. మూడు నెలలుగా పింఛను డబ్బుల కోసం ఆఫీసు చుట్టూ తిరగడం తప్ప ఫలితం కనిపించలేదు. ఆ డబ్బులు రాక రాజయ్య బ్రతుకు మరీ దుర్భరమైపోయింది. పస్తులతోనే రోజులు గడుస్తున్నాయి. ఒకపూట గంజిమెతుకులకయినా నోచుకోవడం లేదు.

రావడం, రావడం రాజయ్య కాళ్ళీడ్చుకుంటూ వచ్చి భావనరావు కాళ్ళమీద పడ్డాడు. రాజయ్య కథ విన్న భావనరావుకు ఉద్రేకం ఆగలేదు. బ్రతికున్న మనిషిని నువ్వు చనిపోయావు అని బయటకు పొమ్మనడం ఏమిటి? పైగా బ్రతికున్నట్టుగా సర్టిఫికేటు తెచ్చుకొమ్మనడం ఏమిటి? అధికారుల నిర్లక్ష్యానికి, అవకతవక పనులకి అర్థం పర్థం లేదా? హద్దూ పద్దూ లేదా?

భావనరావు పనిగట్టుకుని పట్టణం వెళ్ళి ప్రభుత్వ ఖజానా ఆఫీసర్ని కలిశాడు. అతను చూపించిన ఆర్.డి.వో. ఆర్డరును చూసి మతిపోయినట్టయ్యింది. వేరే మార్గం కనిపించలేదు. ఆఫీసరుగారి సలహా ప్రకారం రాజయ్య బ్రతికే ఉన్నట్టుగా ఒక సివిలు సర్జనుకు నలభై రూపాయలు చెల్లించి సర్టిఫికేటు సంపాదించగలిగాడు. దానితో బాటు నన్ను బ్రతికించండని రాజయ్యతో ఓ దరఖాస్తు జత చేసి అధికారులకి పంపించాడు. ఆరు నెలలు ఆకలితో కాలాన్ని ముందుకు నెట్టాయి. తొమ్మిది నెలలు కాలగర్భంలో తొందరగా కలిసిపోయాయి. సంవత్సరం సాఫీగా నిండిపోయింది. రాజయ్యకు మాత్రం పింఛను రాలేదు.

నెలకు నాలుగైదుసార్లు రాజయ్య భావనరావు చుట్టూ తిరుగుతున్నాడు. భావనరావు పట్టణం వెళ్ళినపుడల్లా రాజయ్య విషయం విచారిస్తూ ఖజానా ఆఫీసు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు.

"ఏవండీ మిమ్మల్నే భోజనానికి లేవండి! ఆరాజయ్య గురించేనా మీ ఆలోచనలన్నీ?

అతగాడు వెళ్ళి చాలా సేపయ్యింది." భార్య పిలుపుతో రాజయ్య ఆలోచనల్ని విదిలించుకుంటూ లోపలికి నడిచాడు భావనరావు.

భావనరావు స్కూలుకి సెలవు చీటి పంపించి ఆ రోజు పట్టణం బయలుదేరాడు. భార్య చేతికిచ్చిన సరుకుల జాబితాను జేబులో పెట్టుకున్నాడు. పట్టణంలో సంత పని ఉంది ఆ పై రాజయ్య పని ఎలాగూ ఉంది. రాజయ్య విషయంలో గట్టిగా దెబ్బలాడాలనే దృఢనిర్ణయానికొచ్చాడు. బ్రతికున్న రాజయ్య పాలకుల దృష్టిలో చనిపోయాడు. అతన్ని మళ్ళీ బ్రతికించాలి. చేతికి పింఛను రప్పించాలి. రాజయ్య దరిద్రదేవత కోరల్లో నలిగిపోతున్నాడు. ఆకలితో నకనకలాడుతున్నాడు. అతన్ని రక్షించాలి. ఆదుకోవాలి!తప్పదు!

భావనరావు ఆలోచిస్తూ ఇంట్లోంచి బయటకొచ్చాడు. అరుగు పక్కగా స్టాండు వేసి ఉన్న సైకిలు తీసి చేతిసంచీ దానికి తగిలించాడు.

" మాస్టారూ! మాస్టారూ!" పక్క వీధిలోంచి స్కూలు కుర్రాడు పరుగెత్తుకు వచ్చాడు పరుగెత్తుకు వచ్చాడేమో ఆయాసంతో ఒక్క క్షణం ఆగాడు.

"మన బడి ముందు వేరుసెనక్కాయలమ్మే రాజయ్య లేడండి! ఆ రాజయ్య ఈ పూట చచ్చిపోయాడండి! హెడ్‌మాస్టారు మిమ్మల్ని వెంటనే వెంటబెట్టుకు రమ్మన్నారండి!"

భావనరావు గుండె గతుక్కుమంది. కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి.

రాజయ్య చనిపోయాడా? తను అనుకుంటూనే ఉన్నాడు. ఆకలి మనిషిని అనుక్షణం వెంటాడి వేటాడే మహమ్మారి! రాజయ్యను కూడా పొట్టన పెట్టుకుందన్న మాట! ఎంత దయనీయం?

భావనరావు చటుక్కున తిరిగి సైకిలెక్కి పక్క వీధిలోకి మళ్ళాడు.

రాజయ్య చాలా అభిమానం ఉన్న మనిషి. ఎవ్వరినీ చెయ్యి చాచి అడిగేవాడు కాదు. ఆకలి బాధను ఎప్పుడూ నోరు విడిచి చెప్పలేదు. దాదాపు పన్నెండు నెలలుగా పింఛను రాక అతను పడ్డ బాధ, అగచాట్లు ఊళ్ళో అందరికీ తెలుసు. అతను ఏం తిని బ్రతుకుతున్నాడో తన ఊహకు అందేది కాదు. ఒకటి రెండు సార్లు తన సాయం చేయబోయినా అభిమానంతో తీసుకోలేదు. ఆ నోటా ఈ నోటా విన్నది. రాజయ్య పస్తులున్నాడు. పగలు ఇంటింటికీ నీళ్ళుమోశాడు. అర్థా పావలా సంపాదించుకున్నాడు. ఆ సంపాదన చాలక ఆకలికి తట్టుకోలేక అభిమానం చంపుకుకోలేక చివరికిలా...

భావనరావు స్కూలు దగ్గర కొచ్చాడు. స్కూలు ముందు రావిచెట్టు కింద రాజయ్య నిర్జీవంగా పడిఉన్నాడు. ఈ చెట్టు క్రిందే రాజయ్య నిద్రపోయాడేమో! ఎప్పుడు చనిపోయాడో శవం నిండా ఈగలు ముసురుతున్నాయి. పాపం! ఎవరూ లేకుండా దిక్కులేని చావు చచ్చాడు. రాజయ్య చుట్టూ జనం. స్కూలు పిల్లలు చాలమంది దూరం దూరంగా నిలబడి రాజయ్యను చూస్తున్నారు. అవతల వీధిలోంచి అల్లుడూ, కూతురూ అప్పుడే వచ్చారు కాబోలు, కూతురు తండ్రి శవంమీద పడి భోరుమంటూ విలపిస్తుంది...

శవాన్ని తరలించడానికి హెడ్‌మాస్టారు, పిల్లల దగ్గర్నుంచి, మాస్టార్ల నుంచి చందాలు

వసూలు చేద్దామని ఆలోచిస్తున్నారట! స్కూలు అటెండరు భావనరావు దగ్గరగా వచ్చి చెప్పాడు. భావనరావు హెడ్‌మాస్టారు గదివైపుగా అడుగులు వేశాడు.

" భావనరావు మాస్టారూ!" పిలుపు విని పక్కకు తిరిగి చూశాడు ఎదురుగా పోస్ట్‌మాన్ బ్రహ్మానందం! గబగబా వచ్చి భావనరావు చేతికి పొడుగాటి కవరొకటి ఇచ్చి వెళ్ళిపోయాడు. భావనరావు ఆత్రంగా కవరు విప్పాడు. అది రాజయ్య పేరున వచ్చిన ఉత్తరం! తన కేరాఫ్ ఎడ్రసుకు వచ్చింది. ఉత్తరంలోని సారాంశాన్ని చదువుతూ నిర్లిప్తంగా రాజయ్య దగ్గర కొచ్చాడు భావనరావు.

"రాజయ్యకు తెలియజేయునది.

నన్ను బ్రతికించమని నీవు పెట్టుకున్న దరఖాస్తు పరిశీలించడమైనది. నీవు ఇంకా బ్రతికేఉన్నట్టుగా డాక్టరుగారి సర్టిఫికేటు వలన రుజువైనది. నీకు రావలసిన సదరు పింఛను సొమ్ము సంవత్సరం క్రితం నిజంగా చనిపోయిన కె.రాజన్న అనే వ్యక్తికి పొరపాటున మా సిబ్బంది పంపిస్తున్నట్టుగానూ, అతని తరపున బంధువులెవరో మా సిబ్బందిని మభ్యపెట్టి ఆ సొమ్మును అనుభవిస్తున్నట్టుగాను మాకు తెలిసినందుకు మేము చాలా విచారిస్తున్నాము. త్వరలో ఆ సొమ్ము మొత్తాన్ని సేకరించి నీకు పంపగలము. మా పరిశోధనలో దీనికి బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకోగలవారము.

"ఇట్లు, విధేయుడు జిల్లా రెవెన్యూ అధికారి."

'రాజయ్యా! బ్రతికుండగా నిన్ను అధికారులు చచ్చిపోయావన్నారు. ఇదిగో నువ్వు నిజంగా చనిపోయిన తరువాత బ్రతికే ఉన్నావంటూ ఉత్తర్వు జారీ చేశారు. బ్రతికున్న నిన్ను నిర్లక్ష్యం చేసి నిజంగా చనిపోయిన మనిషికి ఎవరికో నీ పింఛను పంపించారట! నీ కిది ఆనందమే కదూ? నీ ఆత్మ సంతోషిస్తుంది కదూ?'

బావురుమంటోన్న హృదయంతో భావనరావు నువ్వు బ్రతికి ఉన్నావంటూ వచ్చిన ఉత్తర్వుని చనిపోయిన రాజయ్య శవం మీద నిర్లిప్తంగా ఉంచి నిశ్శబ్దంగా కళ్ళు మూసుకున్నాడు.

❀ ❀ ❀ ❀ ❀ ❀

(ఆంధ్రప్రభ, 21.1.87)